క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం


ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం వాసవీభవన్ వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతోనిర్వహించారు. స్థానిక ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం నుంచి గంగాజలాన్ని కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తెచ్చారు. గంగా జలంతో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని దర్శనం కలిప్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ఉపాధ్యక్షుడు గిరిధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

కేవీపల్లె : విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓలు రెడ్డిబాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతి ఏటా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డిబాషా, మాజీ చైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎం సేవలు ఆదర్శనీయం


కుమార్ దంపతులను సత్కరిస్తున్న డీపీటీఓ రాము

పీలేరు రూరల్ : పదవీ విరమణ పొందిన పీలేరు ఆర్టీసీ డీఎం బి. కుమార్ సేవలు ఆదర్శనీయమని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) పి. రాము అన్నారు. శుక్రవారం స్థానిక షఫీ కల్యాణ మండపం డీఎం పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీటీఓ మాట్లాడుతూ పీలేరు డిపో అభివృద్ధికి కుమార్ విశేష కృషి చేశారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు డిపో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం పదవీ విరమణ పొందిన డీఎం కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె 2 డీఎం అమరనాథ, రాజంపేట డీఎం రమణయ్య, ఆత్మకూరు డీఎం వీరాస్వామి, గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి, సీఐ సుబ్బమ్మ, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రాజగోపుర ప్రతిష్ట

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా రాజగోపుర ప్రతిష్ట ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆగమసలహాదారులు శ్రీనివాసచార్యులు,అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్, ధనుష్, కృష్ణంరాజు వేదమంత్రోచ్చారణలతో చతుష్టార్చన, మన్యోమిళనం, క్షీరదివసరం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మునిబాలకుమార్, నగేష్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

పీలేరు : మండలంలోని వేపులబైలు పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులుకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవడానికి పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రజలు రాయితీలో సోలార్ ప్యానెలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ శివయ్య, ఏఈ రామ్మూర్తి పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

–వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 20 లీటర్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం మండలంలోని ముష్టూరు పంచాయతీ ఎరప్పగారిపల్లెలో సారావిక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో యరప్పగారిపల్లికి చెందిన ఉడుం రవి (37) సారా విక్రయిస్తుండగా ఆదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

‘అండగా ఉంటాం’

మదనపల్లె: 108 ఉద్యోగులకు యూనియన్ అండగా ఉంటుందని 108 రాష్ట్ర అధ్యక్షుడు బలి కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీ మహేష్ అన్నారు. జిల్లా కోఆర్డినేటర్ దామోదర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో కలికిరిలో మదనపల్లి డివిజన్ 108 ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా యూనియన్ రాష్ట్రంలోనే ఆదర్శంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా యూనియన్ అధ్యక్షులు ఎస్వి రమణ ఉపాధ్యక్షుడు చలపతి, 108 సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ ?

- యథేచ్ఛగా ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు
- ఎక్కడ చూసినా కవర్లు, వ్యర్థాలు
- చోద్యం చూస్తున్న అధికారులు


కోమటివానిచెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మదనపల్లె సిటీ: ప్లాస్టిక్ ఆరోగ్యానికి ప్రమాదకరమని వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా వినియోగం మాత్రం తగ్గడం లేదు. మదనపల్లె మున్సిపాలిటీలో గతంలో అనేక దఫాలు పాలిథిన్ వినియోగాన్ని నిషేధించినా నెల రోజులు కూడా అమలు కాలేదు. యథేచ్ఛగా వినియోగం జరుగుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. మూగజీవాల మృత్యువాతకు కారణమవుతున్నాయి. నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ప్లాస్టిక్ నిషేధిద్దామంటూ ప్రభుత్వం, పలు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. నిషేధిత క్యారీ బ్యాగుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వ్యాపార సంస్థలు, కూరగాయలు, పండ్ల మార్కెట్‌లో కవర్లు విరివిగా వాడుతున్నారు. అధికారులు ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

పేరుకుపోతున్న వ్యర్థాలు

పాలిథిన్ కవర్లు నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రధానంగా కోమటివానిచెరువు, బాహుదా కాలువలు, కురవంక, బుగ్గకాల్వల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. దీంతో పాటు వీధుల్లోని మురుగునీటి కాలువల్లో చెత్తతో పాటు ప్లాస్టిక్ కవర్లు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో మురుగునీరు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.

విచ్చలవిడిగా విక్రయాలు

పాలిథిన్ సంచులు, గ్లాసులను మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వాటి వినియోగంతో ముప్పు ఉందని నిపుణులు, పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నా ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటోంది. బయట నుంచి టిఫిన్, కూరగాయలు తేవాలన్నా, ఇంటి సరుకులు తీసుకురావాలన్నా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు.

మూడు తరాల వరకూ...

ప్లాస్టిక్ వాడకంతో శరీరం మీద పడే దుష్ప్రభావాలు మూడు తరాల వరకూ కొనసాగుతాయి. బాల్యంలో, యుక్తవయసులో, మధ్య వయసులో... ఇలా జీవితంలోని మూడు దశల్లో వేర్వేరు ఆరోగ్య సమస్యలను కూడా కలిగిస్తాయి. అండాలు, వీర్యకణాల డీఎన్ఏల్లో తేడాలు ఏర్పడి, మూడు తరాల వరకూ పునరుత్పత్తి సమస్యలు వంశపారంపర్యంగా కొనసాగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి సాధ్యమైనంత వరకూ ప్లాస్టిక్‌కు బహిష్కరించకుండా జాగ్రత్త పడాలి.

సమష్టి కృషి అవసరం



మన భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు సమష్టి కృషి అవసరం. ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం సంపూర్ణంగా అమలవుతుంది. ముందు ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగానికి చెక్ చెప్పాలి.

–తిరుపతిరావు, మదనపల్లి

పెద్దిరెడ్డి కుటుంబంపై దుష్ప్రచారం తగదు

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలికిరి (వాల్మీకిపురం): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై దుష్ప్రచారం తగదని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హితవుపలికారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం పులిచెర్ల మండలంలో భూ ఆక్రమణలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో కొన్ని ఫైళ్లు ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైతే నానా హడావిడి చేయడంతో పాటు పెద్దిరెడ్డి కుటుంబంపై అసత్య ప్రచారం చేశారని మండిపడ్డారు. పెద్దిరెడ్డిపై బురద చల్లినా, ఏ ఒక్క ఆరోపణ నిరూపించలేక పోయారన్నారు. 1981లో భూ యజమానులకు రెవెన్యూ అధికారులు హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, 2001లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం భూ యజమానుల నుంచి కొనుగోలు చేసినట్లు రికార్డులు, ఆధారాలు ఉన్నా అటవీభూములు ఆక్రమించారని చెప్పడం దారుణమన్నారు.

ఓర్వలేక..

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడాల్సిన అవసరం లేదని, రాజకీయంగా, వ్యాపార పరంగా రాణిస్తున్న పెద్దిరెడ్డి కుటుంబానికి ఎటువంటి అవినీతి మరకలు లేవన్నారు. ఓర్వలేని ఆ కుటుంబంపై విషం చిమ్మే కుట్రలు పన్నుతున్నాయన్నారు.

నియామకం

కలికిరి (వాల్మీకిపురం): ఉమ్మడి చిత్తూరు జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా వాల్మీకిపురం పట్టణానికి చెందిన వివేకానంద విద్యాసంస్థల అధినేత ఎస్.శ్రీధర్ రాయల్‌ను నియమిస్తూ బీఎస్ఎన్ఎల్ తిరుపతి ఏజీఎం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

బి.కొత్తకోట: స్థానిక ఎస్సీకాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, బాస్ నాయకులు పరిష్కరించాల్సిన వివిధ అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మురికినీటి కాలువలు, సిమెంటు రోడ్లు నిర్మించాలని, అంబేద్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలని కోరారు. తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, ఎంఈఓ–2 భీమేశ్వరాచారి, సర్వేయర్ ముబారక్, వీఆర్ఓలు, సంఘాల నేతలు భవానీ వెంకటేష్, సింగన్న, చౌడప్ప పాల్గొన్నారు.

ఆలయాల భూములు పరిరక్షిస్తాం

పీలేరు : దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల భూములను పరిరక్షిస్తామని ఈఓ రవీంద్రరాజు అన్నారు. శుక్రవారం పీలేరులోని శ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో ఆయన మాట్లాడుతూ పీలేరు మండలంలో ఆలయాల భూములు 222 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. అయితే చాలా వరకు ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని, సర్వే చేసి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

మూగజీవాల సంరక్షణకు చర్యలు

తంబళ్లపల్లె: మూగజీవాల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ సుమిత్ర తెలిపారు. శుక్రవారం తంబళ్లపల్లె మండలంలోని దాదంవడ్డిపల్లె, చేలూరివారిపల్లె, పెద్దమండ్యం మండలం మిట్టవాండ్లపల్లె, వడ్డిపల్లిల్లో ఉచిత పశువైద్యశిబిరాలు నిర్వహించారు. 70 ఆవులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. పశువైద్యులు సుజనశ్రీ, విక్రమరెడ్డి, ఉస్మాన్ పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

కలకడ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎంపీపీ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి సరిపడా సభ్యులు రాకపోవడంతో వాయిదా వేశారు.

హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచాలి


మాట్లాడుతున్న పీఎల్ నరసింహులు

మదనపల్లె : హంద్రీనీవా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని, కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులు నీటిని పెంచి, దానికి సమాంతరంగా మరో కాలువ తీసుకురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. సీపీఐ మదనపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆఫీసులో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణ దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీన మదనపల్లి సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, పట్టణ ప్రజలు, విద్యార్థులు యువకులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే మురళి, నాయకులు మాధవ్, తిరుమల, గజేంద్ర పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


ఉచిత వైద్యశిబిరానికి హాజరైన గ్రామస్తులు

మదనపల్లె : మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్డులో సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సీటీఎం–2 పంచాయతీలోని కొత్తపేట, మిట్టపల్లెకు చెందిన గ్రామస్తులు హాజరై వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా స్వాస్థ ఆస్పత్రి వైద్యులు ఐశ్వర్య, డాక్టర్ ప్రియం, వైద్యబృందం రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను అందజేశారు. సీటీఎం–2 అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండపల్లి వెంకటరమణ, నర్సులు సుజాత, శ్రావణి పాల్గొన్నారు.

రేపటి నుంచి వైద్యశిబిరం

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి వారం రోజుల ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వంగిమళ్ల నరసారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తెలిపారు. చెన్నై శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాలచే రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి ఆదివారం నుంచి 5వ తేదీ వరకు కంటి పొర పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎంపిక చేసినవారికి కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని కేవీపల్లె, పీలేరు, కలికిరి, కలకడ మండలాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 49 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 29 మందికి ఆపరేషన్ చేయాలని ఆసుపత్రి చైర్మన్ భాస్కర్ నాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ రవిశంకర్ తెలిపారు.


మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ములకలచెరువు: ములకలచెరువు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలానికి కేటాయించిన మద్యంషాపు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మాదవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గీత కులాలు, ఉప కులాలకు చెందిన వారు అర్హులన్నారు. రూ.2 లక్షలు దరఖాస్తు రుసుం, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 5వ తేదీ చివరి గడువు అన్నారు. ఆసక్తిగల వారు సర్కిల్ కార్యాలంలో సంప్రదించాలని సీఐ కోరారు.

కలకడ : కలకడ మండలానికి అదనంగా మరో బ్రాంది షాపును ప్రభుత్వం మంజూరు చేసినట్లు పీలేరు ఎక్సైజ్ శాఖ సీఐ తెలిపారు. కల్లుగీత కార్మికులకు(ఈడిగ ఉపకులం) కేటాయించినట్లు తెలిపారు. రూ.2 లక్షలు ధరఖాస్తు రుసుం, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 5వ తేదీ చివరి గడువు అన్నారు. ఆసక్తిగలవారు సర్కిల్ కార్యాలంలో సంప్రదించాలని సీఐ కోరారు.

పిచ్చి కుక్క వీరంగం

– ఐదుగురిపై దాడి


పిచ్చికుక్క దాడిలో గాయపడిన అలీ

ములకలచెరువు: ఒక పిచ్చి కుక్క వీరంగం సృష్టించి ఐదుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో కలకలం రేపింది. ఇప్పటికి ఇది మండలంలో రెండో ఘటన. మండల కేంద్రం పీటీఎం రోడ్డు, నల్లగుట్టలో పిల్లలు, వృద్ధులను దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ ఎదురు పడిన వారిపై దాడికి పాల్పడింది. ములకలచెరువుకు చెందిన అలీ (8), పూనర్వీక(5), చౌడసముద్రంకు చెందిన రమణమ్మ (48), పాతకోటకు చెందిన వెంకటేష్ (60), సత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన రామాంజులు (55) ములకలచెరువు పీహెచ్‌సీలో చికిత్స పొందారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కుక్కల భయంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు హడలిపోతున్నారు.

కూటమి పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడు త్రైమాసికాలుగా బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యలో చదువులు ఆగిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. 2014–19 మధ్య చంద్రబాబు పాలనలో బకాయిపడ్డ రూ.2,800 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో విద్యకు ఎలాంటి ఆటంకాలు కలగలేదన్నారు. ఫీజులు చెల్లించడంతో పాటు విద్యదీవెన, వసతి దీవెనకు రూ.18వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ప్రస్తుతం రూ.1,100 కోట్ల వసతి దీవెన ఇవ్వకుండా, రూ.2,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టారని అన్నారు. విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని అన్నారు. గద్దెనెక్కక ముందు ఒక మాట, ఇప్పుడు ఒక మాట మాట్లాడుతున్నారని అన్నారు. అమ్మఒడి, ఇంగ్లీషు మీడియం, టోఫెల్, తరగతి నుంచి అమలు చేసిన సబ్జెక్ట్ టీచర్ విధానాలను రద్దు చేసి విద్యను నాశనం చేస్తున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా పేదలు చదువుకోకుండా చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా ఫిబ్రవరి 5న వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న ఫీజు పోరుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్


నిసార్‌అహ్మద్‌ను సన్మానిస్తున్న నాయకులు

మదనపల్లె : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషిచేసి, పూర్వవైభవం తెచ్చేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పిలుపునిచ్చారు. మదనపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియామకాలు పొందిన పలువురు శుక్రవారం నిసార్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్చం అందించి సత్కరించారు. తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, సమన్వయకర్త నిసార్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనుబంధ విభాగాల అధ్యక్షులను నిసార్ అహ్మద్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడునెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ఎవరితో మాట్లాడినా, టీడీపీని గెలిపించి మోసపోయామని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ప్రజలతో మమేకమై, ప్రభుత్వ వైఫల్యాలను వారికి వివరిస్తే, తప్పకుండా పార్టీకి పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అన్నమయ్యజిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు పాల్ చంద్రశేఖర్, నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు రిచర్డ్ క్రిస్టఫర్ అలెగ్జాండర్, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ యూనస్, ఎస్టీ విభాగం ఈశ్వర్‌నాయక్, నూర్‌మొహిద్దిన్‌ఖాన్, ఎస్.ఏ.కరీముల్లా పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం ప్రకటన చేయాలి

మదనపల్లె : అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పే ముఖ్యమంత్రి ఎనిమిది నెలల క్రితం పెంచిన పెన్షన్‌ను ప్రచారం చేసుకునేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాగా రూ.10 వేల కోట్లు కేటాయించాలని, అన్నమయ్య, పింఛ, ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలని, ముదివేడు ప్రాజెక్టు నిర్వాసితులకు, అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాసం, ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. మదనపల్లెలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని, బెసెంట్ థియోసాఫికల్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, మెడికల్ కాలేజీని ప్రైవేట్ పరం చెయ్యడం లేదని సీఎం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి


బ్యాంకును ప్రారంభిస్తున్న ప్రభాహరన్

తంబళ్లపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలును వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆ బ్యాంకు జీఎం ప్రభాహరన్ ఆకాంక్షించారు. శుక్రవారం ములకలచెరువు మండలం చౌడసముద్రంలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన బ్యాంకు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జీఎం మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకు అభివృద్ధికి సహరించిన ప్రజలను అభినందించారు. అన్ని రకాల రుణాలతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుని బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. రీజనల్ మేనేజర్ ప్రకాష్‌రత్నబాబు, బ్రాంచి మేనేజర్ శ్యాముల్ వణికుమార్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

భూ వివాదంలో కుటుంబంపై దాడి

మదనపల్లె : భూ వివాదం కారణంగా కుటుంబంపై దాడి చేసిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. వెంకన్నవారిపల్లె పంచాయతీ కత్తిరివారిపల్లెకు చెందిన మల్లికార్జున, శివల మధ్య మూడు సంవత్సరాలుగా భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. అందుకు సంబంధించి ఇరువర్గాల వారు కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం కోర్టులో వివాదం విచారణ దశలో ఉంది. అయితే సదరు భూమిలో మల్లికార్జున కుటుంబం ఉలవల పంట సాగు చేసింది. ఈ క్రమంలో శుక్రవారం శివ తన తల్లి గంగులమ్మ, మరి కొందరితో కలిసి ఉలవల పంట పొలం పైకి గొర్రెల మందను వదిలారు, ట్రాక్టర్‌తో భూమి దున్నేందుకు ప్రయత్నించారు. దీంతో మల్లికార్జున వర్గీయులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. శివ అతని తల్లి గంగులమ్మ, దేవర మల్లికార్జున, విశ్వనాథ, వాసు, వెంకటేశు తదితరులు పి.మల్లికార్జున కుటుంబంపై కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనలో మల్లికార్జున(60)తోపాటు అతని కుటుంబ సభ్యులు ఎర్రమ్మ (75), సంపూర్ణమ్మ (55), భార్గవ్ (10)లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

‘మేముసైతం’కు బెస్ట్ సోషల్ ఎన్జీఓ అవార్డు

పీలేరురూరల్ : పీలేరుకు చెందిన మేముసైతం సమాజం కోసం అనే స్వచ్ఛంద సంస్థకు బెస్ట్ సోషల్ ఎన్జీఓ అవార్డు లభించింది. కడప జిల్లా సీకేదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లో బృంద స్ఫూర్తి 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సేవలకు గానూ అవార్డుల ప్రదానం చేశారు. ఇందులో భాగంగా యువజన సర్వీసుల శాఖ జిల్లా అధికారి సాయిగ్రేస్ చేతుల మీదుగా మేముసైతం సంస్థ అధ్యక్షుడు షేక్ షాహిన్షాను సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రవిప్రకాష్‌రెడ్డి, బాలసుబ్బయ్య, సుధారాణి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ వ్యక్తి కాదు.. సమూహ శక్తి


పీలేరు రూరల్: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


మదనపల్లె: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాస్, వీసీకే నాయకులు

మదనపల్లె : గద్దర్ ఒక వ్యక్తి కాదు సమూహశక్తి అని ఆయనను విమర్శిస్తే సహించేది లేదని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ హెచ్చరించారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని శుక్రవారం స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వీసీకే పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ గద్దర్ ప్రజల మనిషి అని, ప్రజా యుద్ధనౌకగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానం పొందారని కొనియాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. బండి సంజయ్‌ని వెంటనే మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్ లతోపాటు బాస్, వీసీకే నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, వై. చిన్నా, వై. గంగాధర్, మీసాల గంగులు, నర్సీ, క్రాంతి, ఇర్ఫాన్, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి

పీలేరురూరల్ : విప్లవ నాయకుడు గద్దర్ 77వ జయంతిని శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ మాట్లాడుతూ పాటలతో విప్లవాన్ని, మాటలతో చైతన్యాన్ని నింపారని పేర్కొన్నారు. పేదల కోసం పాటుపడ్డారని తెలిపారు. మల్లికార్జున, హరినాథ, గురవయ్య, రామకృష్ణ, బాలు, జెట్టి మల్లికార్జున, విజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.